ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 24
సంచిక : 134
పేజీలు : 3
బుధవారం, ఫిబ్రవరి 04, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

**టీ మీడియా, ఫిబ్రవరి3, కామేపల్లి**

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఢిల్లీలోని, జంతర్ మంతర్ దగ్గర ఈనెల 5వ తారీఖున ఉపాధ్యాయుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిఆర్‌టియు టీఎస్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు ఉపాధ్యాయ లను కోరారు. మహా ధర్నా పోస్టర్లను మండల విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిటిఎఫ్ నుండి లింగా నాయక్, పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పి.రాములు, టి.వెంకన్న, ఎన్. వెంకన్న, యుటిఎఫ్ నుండి జె.సత్యం, మోహన్ రావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మేడారంలో స్వచ్ఛ భారత్

**-2480మంది కూలీలు, 120 ట్రాక్టర్లు -వ్యర్థాల తొలగింపు పనులు**





**టీ మీడియా, ఫిబ్రవరి3,ములుగు** : మేడారంలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో ముగియడంతో చెత్తా చెదారాన్ని తొలగించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులపై పడ్డారు. వేలాది మంది కూలీలు, వందల సంఖ్యలో అధికారులు, పెద్ద పెద్ద యంత్రాల సాయంతో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ నెల 4 నాటికి అంటే బుధవారం స్వచ్ఛ మేడారంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు తెలపారు.

**2,480 మంది కూలీలతో**

వనదేవతలను దర్శించుకోవడానికి జాతరకు కోటి మందికి పైగా భక్తులు రావడంతో చిలకలగుట్ట, జంపన్నవాగు, రెడ్డిగూడెం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపురం తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు భారీ స్థాయిలో పేరుకుపోయాయి. లక్షలాది మంది గుడారాలు వేసుకుని నాలుగు రోజుల పాటు విడిది చేయడంతో మేడారం పరిసర ప్రాంతాల్లో జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం వంటివి పేరుకుపోయాయి. వీటిని తొలగించేందుకు 2,480 మంది కూలీలు మూడు షిఫ్టుల్లో నిరంతరంగా పనులు చేస్తున్నారు. 22 జిల్లా పంచాయతీ అధికారులు, 41 మంది డీఎల్పీవోలు, 76 మంది ఎంపీవోలు, 688 మంది పంచాయతీ సెక్రటరీలు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

**యంత్రాల వినియోగం**

జాతర ప్రాంగణంలో వ్యర్థాల సేకరణ, డంపింగ్ యార్డులకు తరలింపు, పూడ్చివేత పనుల కోసం



యంత్రాలను అధిక సంఖ్యలో వినియోగిస్తున్నారు. కూలీలు సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు 120 ట్రాక్టర్లలో డంపింగ్ యార్డులకు వేగంగా తరలిస్తున్నారు. ఇందుకోసం మేడారం, ఊరట్టం, వెంగ్లాపురం, నార్లాపురం పంచాయతీల్లో 15 డంపింగ్ యార్డులను సిద్ధం చేశారు. ట్రాక్టర్లలో తీసుకొచ్చిన వ్యర్థాలను కాల్చివేయకుండా ఒక దగ్గరికి చేర్చి చెత్త కుప్పలపై మట్టి కప్పుతున్నారు. ఇలా చేయడం ద్వారా తీవ్ర స్థాయిలో కాలుష్యం వెలువడకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఈగలు, దోమల నివారణకు చర్యలు**

జాతర కారణంగా మేడారం, పరిసర గ్రామాల్లో ఈగలు, దోమల వ్యాప్తి తీవ్రంగా పెరిగింది. వీటి నివారణకు ఈసారి వినూత్నంగా చర్యలు చేపట్టారు. 1,250 క్వింటాళ్ల బ్లీచింగ్ పౌడిని వ్యర్థాలు, మురుగునీటి నిల్వలపై చల్లించే కార్యక్రమం చేపట్టారు. 3 ట్రాక్టర్ కెమికల్ స్ప్రేయర్లతో డెల్టాపాగ్, పైథ్రీన్, మొలాసిన్, థీమాపాస్, బయోలిన్, బయోడైవర్సీ అనే మందులను స్ప్రే చేయిస్తున్నారు. మంత్రి సీతక్క

మిగతా 3లో



# ఏదులాపురంలో 'హస్తం' దూకుడు

**ఇంటింటికీ పొంగులేటి ప్రసాద్‌రెడ్డి**

**టీ మీడియా, ఫిబ్రవరి3 , ఖమ్మం రూరల్ :** మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో కాంగ్రెస్ పార్టీ అగ్రశ్రేణి శ్రేణులు సుడిగాలి పర్యటనలతో దూసుకుపోతున్నాయి. మంగళవారం సాయంత్రం 18, 19 వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమం రాజకీయ వేడిని రాజేసింది. ?

**రోడ్ షోకు అపూర్వ స్పందన**

ముఖ్య నేత పొంగులేటి ప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. 18వ వార్డు అభ్యర్థిని పందూరి అరుణ, 19వ వార్డు అభ్యర్థిని మాలాది శిరీష గెలుపును ఆకాంక్షిస్తూ బారుగూడెం, గొల్లగూడెం ప్రాంతాల్లో ప్రసాద్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు.

**సంక్షేమ పథకాలే విజయ సూత్రం**

గడప గడపకూ వెళ్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండేళ్లలోనే పేదలకు అండగా నిలిచే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, అదే స్ఫూర్తితో మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**పట్టణ ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం**

అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టణ ప్రగతి మరింత వేగవంతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో విజయతీరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు.

# లిఫ్ట్ ఇచ్చాడు... కత్తి గుచ్చాడు



**నల్గొండలో దారుణ ఘటన**

**టీ మీడియా, ఫిబ్రవరి 3,నల్గొండ** :జిల్లాలో మానవత్వాన్ని దుర్వినియోగం చేసిన దారుణ ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా కేంద్రం నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం తన కారులో హైదరాబాద్ బయలుదేరిన ఇమ్రాన్ అనే వ్యక్తి, మార్గమధ్యలో నార్కెట్‌పల్లి వద్ద లిఫ్ట్ అడిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తిని మానవతా దృక్పథంతో కారులో ఎక్కించుకున్నాడు.అయితే చిట్యాల సమీపానికి చేరుకోగానే, ఆ వ్యక్తి అకస్మాత్తుగా ఇమ్రాన్‌పై కత్తితో దాడి చేశాడు. ఇమ్రాన్ మెడతో పాటు శరీరంపై విచక్షణ లేకుండా కత్తిపోట్లకు పాల్పడి, అతని సెల్‌ఫోన్ మరియు నగదు లాక్కునేందుకు దుండగుడు ప్రయత్నించినట్లు తెలుస్తోంది.తీవ్ర గాయాల మధ్య కూడా ఇమ్రాన్ ధైర్యంగా ప్రతిఘటించడంతో, భయాందోళనకు గురైన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇమ్రాన్‌ను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అతడిని తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు

మిగతా 3లో

# కట్టుదిట్టంగా ఎన్నికల విధులు

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టీ మీడియా, ఫిబ్రవరి3ఖమ్మం:**ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైరా తహసీల్దారు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బీ-పామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు, బీ-ఫామ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత



వాతావరణంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలిఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల అధికారులు క్షేత్ర స్థాయిలో కలిసి పని చేసి మన జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా అందరు కలిసి పనిచేయాలని సూచించారు.

మిగతా 3లో



## పోలీస్ జాగిలాలతో గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు

**టీ మీడియా, ఫిబ్రవరి 3,కొత్తగూడెం** ":జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సూచనలతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు నిర్వహించారు.కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించబడిన ప్రదేశాలలో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ తనిఖీలను నిర్వహించడం కోసం మత్తు పదార్థాలను కనిపెట్టే పోలీస్ జాగిలాలను ఉపయోగించడం జరిగిందని వివరించారు.ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లుగానీ, అక్రమ రవాణా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సీఐ కోరారు.



# అందకాలం నీటి ఎద్దడికి చెక్...

### ఎండాకాలానికి ముందే అప్రమత్తం...

### నీటి ఎద్దడి పై అధికారుల సమగ్ర కార్యాచరణ

**టీ మీడియా, ఫిబ్రవరి03, సింగరేణి (కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం లో వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా మండలంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావు, గ్రిడ్ ఏఈ చంద్రశేఖర్ అధికారులు ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇప్పటి నీటి పరిస్థితులను సమీక్షించి, వేసవిలో ఎద్దడి పరిస్థితి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈసారి ముందస్తు ప్రణాళికలతో నీటి నిర్వహణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యాచరణలో భాగంగా బోర్లు, నీటి వనరులు, పైప్‌లైన్లు, మోటార్లు, ట్యాంకుల పనితీరును ముందుగానే తనిఖీ చేసి, మరమ్మత్తులు పూర్తి చేయనున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయడంతో పాటు, నీటి వృథాను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. వేసవిలో నీటి కష్టాలు రాకుండా మండలంలో 20 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ డ్రైవ్ మంగళవారం నుంచి 20 రోజుల పాటు కొనసాగుతుందని, మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు, సమీక్షలు, నివారణ చర్యలు చేపడతామని వివరించారు.



## ఆంజనేయ స్వామి ఆలయానికి విగ్రహం,దర్వాజ

**టీ మీడియా,ఫిబ్రవరి03, సింగరేణి (కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అనంతారం తండా లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి ఇల్లందు కు చెందిన న్యూ శ్రీలక్ష్మి నరసింహ ఎంటర్ప్రైజెస్ అధినేత కాటేపల్లి సుధారాణి, శ్రీనివాసరావు ల కుమారులు కాటేపల్లి నరేష్, లవ కుమార్ లు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆలయానికి అందించారు. అలాగే ఆలయ దర్వాజను ఇల్లందు సునీత ఫ్యాషన్ అధినేత చీమల కరుణాకర్ ధనలక్ష్మి ల కుమారులు చిమల కరుణకర్, నవీన్ లు అందించారు.ఈ సందర్భంగా వారు ఆలయ అభివృద్ధికి మా వంతు సహాయం చేయటం సంతోషకరంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో వాంకుడోత్ రవికుమార్, వాంకుడోత్ నరేష్, మూడ్ సాయితేజ, వాంకుడోత్ సతీష్, వాంకుడోత్ సందీప్, వాంకుడోత్ సుమన్ పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా పంపిణీ

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**టీ మీడియా, ఫిబ్రవరి 3,ఖమ్మం:**ఖమ్మం జిల్లాలో యూరియా పంపిణీ ఫర్టిలైజర్ యాప్ ద్వారా విజయవంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జనవరి, 29వ తేదీ నుండి యూరియా పంపిణి యాప్ ద్వారా జరుగుతుందని, ఈ వారం రోజుల్లో 25252 మంది రైతులు 108721 యూరియా సంచులను యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని, 87350 సంచులను కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ అన్నారు.రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంట రకమును బట్టి, వారికున్న విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ వద్ద అయినా, ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చని అన్నారు. ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుందని, మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వారు, కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. కౌలుదారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారో వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చని, అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుందని అన్నారు. ఈ యాప్ ను రైతులకు అలవాటు చేయటానికి, అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తి ని నియమించడం జరుగుతుందని లేదా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి రైతులకు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు. రైతులందరూ ఈ యాప్ ను వినియోగించుకొని యూరియాను కొనుగోలు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. డీలర్లు, సహకార సంఘాల వారు యాప్ లో మాత్రమే యూరియా అమ్మకాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు తమ యొక్క ఆండ్రాయిడ్ ఫోన్లో యాప్ ను ప్లే స్టోర్లో సులభంగా డౌన్లోడ్ చేసుకోవచ్చని, తద్వారా రైతులు ఏ విధమైన ఆందోళన, శ్రమ లేకుండా తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకొని యూరియా కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. యాప్ అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంలో ఎంత యూరియా అందుబాటులో ఉందనే సమాచారం రైతులందరికీ తెలియటం వల్ల రైతులు తమ ఇంటి వద్ద నుండే యూరియా ను బుక్ చేసుకొని 24 గంటల్లో కొనుగోలు చేస్తున్నారన్నారు. యాప్ తో క్యూ లైన్ లలో నిలబడే అవసరం లేదని, సమయం ఆదా అవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## కాంగ్రెస్ పార్టీ మొదటి విజయం

**టి మీడియా ఫిబ్రవరి 3,ఖమ్మం రూరల్:** ఏదూలపురం మున్సిపాలిటీ ఎన్నికలు ఈ నెల 11 నా జరనుండగా మొదటి విజయం గా కాంగ్రెస్ పార్టీ 15 వార్డు తో కాంగ్రెస్ పార్టీవిజయానికి మొదటిమెట్టువేసింది అనిచెప్పుకోవాలి విషయం::: నామినేషన్ఉపసవర్ణకు ఈ రోజు తో ముగియనేల 15 వార్డు లో సి పీఎం నామినేషన్ దాఖలు చేసిన వారి లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తమ్మినేని మంగతాయి పార్టీ అభ్యర్థిగా తమ్మినేని విజయలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు , అయితే తమ్మినేని విజయలక్ష్మి తన నామినేషన్ ఈ రోజు విత్ డ్రా చేసుకోవటం తో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న తమ్మినేని మంగతాయి ఏకగ్రీవం గా ఎన్నికై కాంగ్రెస్ పార్టీ కి ఏదూలపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో మొదటి విజయం సాధించటం తో కాంగ్రెస్ శ్రేణులు నాయకులు సంతోష వ్యక్తంచేస్తున్నారు, 15 వ వార్డు ఏకగ్రీవం కావటం మిగిలిన 31 వార్డు లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుంది అని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు.

## జీ రామ్ జి ఉపాధి పథకంపై విష ప్రచారం నమ్మొద్దు

**టీ.మీడియా,ఫిబ్రవరి3,చింతూరు:**కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి జీ రాంజీ గా ప్రకటించిందని ఇది హర్షణీయమని దీనిపై కొన్ని రాజకీయ పార్టీలు విష ప్రచారం చేస్తున్నాయని వాటిని ప్రజలు నమ్మొద్దని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం వెంకయ్య, బిజెపి చింతూరు మండల మాజీ అధ్యక్షులు దాసరి వెంకట సూర్య రమణారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వందరోజుల పనిని 125 రోజులకు ప్రభుత్వం పెంచి రోజుకు ఇస్తున్న కూలికి అదనంగా 50 రూపాయలు పెంచిందని ఇది ఎంతగానో ప్రజలకు ఉపయోగమని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్లో కాకుండా వ్యవసాయం లేని రోజుల్లో 125 రోజుల పని 125 రోజులు పని కల్పిస్తున్నారని, అలాగే ప్రతి 15 రోజులకు ఇస్తున్న వేతనాన్ని, ఏడు రోజులకే ఇచ్చే విధంగా మార్పులు చేస్తూ ప్రతి సంవత్సరం రెండుసార్లు, ఆరు నెలలకు ఒకసారి సోషల్ ఆడిట్ జరిగే విధంగా ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఈ విధమైన మంచి పనిని చెడుగా చేసి ప్రజల్లో మెప్పు పొందాలంటే కుదరదని, అలా విష ప్రచారం చేసే వారికి ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సారథ్యంలోఎన్డీఏ కూటమి విజయ డంకా మోగిస్తుందని, దీనికి తిరుగులేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు కోట్ల వెంకన్న, మహిళా నాయకురాలు జారే బోజ్జమ్మ, శ్యామల లక్ష్మణరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.





## గంజాయి నుండి కాపాడుకుందాం

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి

**టీ మీడియా,ఫిబ్రవరి3,చింతూరు:**భారతదేశంలో భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుండి కాపాడుకోవాలని గంజాయి రహిత భారతదేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని టీచర్స్ ఎమ్మెల్సీ గోపి మూర్తి మంగళవారం చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించి విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గోపి మూర్తి మాట్లాడుతూ గంజాయి దురలవాట్లకు బానిసలైన విద్యార్థులు పౌరులు తీవ్ర అనారోగ్య పాలై ఆర్థికంగా ఆరోగ్యపరంగా కూడా నష్టపోతున్నారని భయంకరమైన ఈ దురాలవాటు నుండి దూరంగా ఉండాలన్నారు. గంజాయి వ్యసనం వలన మనిషి తన మనుగడను మర్చిపోయి విచక్షణ రహితంగా ప్రవర్తిస్తాడని, గంజాయి పేరేపిత వ్యక్తులు ఎటువంటి దుర్మార్గాలకైనా వెనుకాడారని గంజాయి మత్తుకు బానిసలైన వారు దానిని పొందుటకై ఎంతటి భయంకరమైన పనులైన చేయడానికి వెనుకాడాలని అన్నారు. దేశ భవిష్యత్తు యువత మీదే ఆధారపడిందని యువత మత్తు పానీయాలకు బానిసైతే దేశ మనుగడే దెబ్బతింటుందని యువకులు భావి భారతానికి ఎంతో అవసరమని అందుకే మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం గంజాయి అలవాటు వల్ల జరిగే విపత్కర పరిణామాలతో కూడిన కరపత్రాన్ని విద్యార్థులకు అందజేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పండ కృష్ణయ్య, ఎస్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పి పెంటమ్మ, ఎస్ సుబ్బయ్య, కే నాగరాజు, భద్రయ్య, సుజాత, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో

## కాంగ్రెస్‌లో చేరిన గణపారపు వీరయ్య

**టీ మీడియా, ఫిబ్రవరి3 , ఖమ్మం రూరల్ :** 27వ వార్డులో నివాసం ఉంటున్న సీపీఐ సీనియర్ నాయకుడు గణపారపు వీరయ్య ఇంటికి మంగళవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా గణపారపు వీరయ్య, మధుతో పాటు మరో 20 మంది సీపీఐ నాయకులకు మంత్రి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలకు మరింత ప్రాధాన్యత చేకూరింది.



## మేడారంలో

మేడారాన్ని గ్రామ ప్రజలకు తిరిగి అద్దంలా ఇస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. బుధవారం రోజు తిరుగువారం పండుగ ఉంటుందని తెలిపారు. ఆ లోపు పారిశుద్ధ్య పనులను చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. సమ్మక్క సారలమ్మల వనప్రవేశంతో మహాజతర పూర్తయినప్పటికీ భక్తుల సందడి మాత్రం తగ్గడం లేదు. ఇంకా మేడారం వచ్చి అమ్మవారి గద్దెలను దర్శనం చేసుకుంటూనే ఉన్నారు.జనవరి 31 నాటికి మహాజాతర పూర్తయినప్పటికీ భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గినట్లు కనిపించడం లేదు. నిత్యం ఇంకా లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. దీంతో జాతర పరిసరాల్లో కూలీలు వ్యర్థాలను సేకరిస్తున్నప్పటికీ మళ్లీ పేరుకు పోతున్నాయి. పారిశుద్ధ్య సమస్యను సవాల్‌గా స్వీకరించాం. ఈ నెల 4న జరగనున్న తిరుగువారం పండగ నాటికి మేడారంను అద్దంలా మార్చేందుకు అందరం తీవ్రంగా కృషి చేస్తున్నాం" –వెంకయ్య, ములుగు జిల్లా పంచాయతీ అధికారిమేడారం జాతరకు ఓ వైపు భక్తులు తరలివస్తుండగా మరోవైపు చిరు వ్యాపారులు తమ గుడారాలను ఖాళీ చేసి తమ స్వస్థలాలకు వెనుదిగురుతున్నారు. సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.మేడారం మహా జాతర సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు మొత్తం 788 హుండీలను ఏర్పాటు చేశారు. జాతర ముగియడంతో వాటిని ఆర్టీసీ కార్గోలో హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపానికి జాగ్రత్తగా తరలిస్తున్నారు. సోమవారం గద్దెల వద్ద మళ్లీ కొత్తగా 40 హుండీలను ఏర్పాటు చేశారు.

## లిఫ్ట్ ఇచ్చాడు... కత్తి గుచ్చాడు

సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. హైవేలపై లిఫ్ట్ ఇచ్చే విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## కట్టుదిట్టంగా ఎన్నికల విధులు

ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు తర్వాత ఉపసంహరణ, రాజకీయ పార్టీ ల బీ–ఫామ్ పరిశీలన చాలా ముఖ్యమైన అంశమని వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నామినేషన్ల అప్పిళ్ళ పరిష్కారం, బీ–ఫామ్ లేని అభ్యర్దులు స్వతంత్ర అభ్యర్థులు గా ప్రకటన, గుర్తుల కేటాయింపు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఏలాంటి తొందరపాటు లేకుండా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్ లో సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు.ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వైరా తహసీల్దారు సురేష్ బాబు, మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఎంపీడీవో తేజావత్ సక్రియ, ఎంఈఓ వెంకటేశ్వర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కాన్సర్ వ్యాధిపై అవగాహన

**టీ మీడియా, ఫిబ్రవరి 3, కొణిజర్ల**

మండలంలోని కొణిజర్ల, పెద్దగోపతి పిహెచ్‌సీలలో మంగళవారం ఆశా డే సందర్భంగా క్యాన్సర్ వ్యాధిపై అవగహన కార్యక్రమం పిహెచ్‌సీ వైద్యులు రాధాకృష్ణ, శారదా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వాక్సిన్ మేనేజర్ సి. హెచ్.వి రమణ పాల్గొని మాట్లాడుతూ కాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రజలు దూమ పాన, మధ్యపాన, జంగ్ ఫుడ్స్ కి దూరంగా ఉంటూ పోషకాహారాన్ని తీసుకుంటూ తగిన శారీరక వ్యాయామం చేయటం ద్వారా, వాక్సినేషన్ (Hpv /Hept B) తీసుకోవటం ద్వారా, అనారోగ్యానికి గురిఅయినప్పుడు వెంటనే పరీక్షలు చేయించుకోవటం, వెంటనే చికిత్స తీసుకోవటం ద్వారా కాన్సర్ నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిపై ఆశాలు, ఎఎన్ఎమ్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందించి నూరు శాతం లక్ష్య సాధన దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దుర్గ మల్లేశ్వరి, హెచ్ఈవో నాగేశ్వరరావు, సూపర్వైజర్స్, ఎఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

# డా॥ పులిపాటి నగర్‌లో ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**తుమ్మల యుగేందర్ పుట్టినరోజు వేడుకలు**

**టి మీడియా, ఫిబ్రవరి3, ఖమ్మం బ్యూరో:**నగరంలోని డా॥ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ మహోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ రోజున నిర్వహించిన రంగోలి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

అదేవిధంగా పులిపాటి టవర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మినీ ఏసీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించడంతో పాటు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, వాకింగ్ ట్రాక్‌లను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల యుగేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజును అసోషియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టినరోజు వేడుకలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా తుమ్మల యుగేందర్ మాట్లాడుతూ, నివాస ప్రాంతాల అభివృద్ధిలో వెల్ఫేర్ అసోషియేషన్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఇలాంటి సంఘాలు ముందుండాలని ఆకాంక్షించారు.



విశిష్ట అతిథులుగా ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ , తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి , డిప్యూటీ మేయర్ శ్రీమతి ఫాతిమా జోహారా షేక్ గారు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమం డా॥ పులిపాటి నగర్, రోడ్ నెంబర్--2, గొల్లగూడెం రోడ్, మమత మెడికల్ కాలేజీ సమీపంలో నిర్వహించగా, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డా॥ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

**-జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**టీ మీడియా, ఫిబ్రవరి 3,పాల్వంచ:** పాల్వంచ టౌన్ 31వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఎం అభ్యర్థి కే సత్య మంచి కంటి నగర్ లో విస్తృత సమావేశం పార్టీ పట్టణ కార్యదర్శి పి తులసి రామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడిన జిల్లా కార్యదర్శి మచ్చవెంకటేశ్వర్లు అన్నవరపు కనకయ్య ఏజే రమేష్ మాట్లాడుతూ... 23 సంవత్సరాల క్రితం పేదలను సమీకరించి ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు పంచినపార్టీ అనేక పోరాటాల ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేసిన పార్టీ సిపిఎం పార్టీ మాత్రమే అని ఎన్నికల్లో మా పార్టీని గెలిపిస్తే డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలందరూ ఐక్యమత్యంతో పార్టీని గెలిపించుకోవాలని ప్రజా పోరాటాలతో సంబంధం లేని వారు కల్లబొల్లి కబుర్లతో వాగ్దానాలు చేసి ప్రజలను గందరగోళం పరిచే అవకాశం ఉంటుందని అలాంటి వాళ్ళ చేతుల్లో డివిజన్ భవిష్యత్తుని పెట్టవద్దని పోరాడే పార్టీకే పట్టం కట్టాలని నాయకులు కోరారు. పార్టీ అభ్యర్థి కే.సత్య మాట్లాడుతూ... డివిజన్లో ఉన్న ప్రజలందరినీ కలుపుకొని పని చేస్తానని అందరూ తన గెలుపుకి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు



సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవి కొండబోయిన వెంకటేశ్వర్లు పార్టీ సీనియర్ నాయకులు ఎం వి అప్పారావు, రాందాస్ పార్టీ నాయకులు ఎస్కే నిరంజన్ సత్యవాణి నింజా రాములు సులోచన కాంతి బి మాధవి ఐద్వా నాయకులు ఎస్ లక్ష్మి బి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా స్త్రీ శక్తి, అంగన్వాడి భవనాలు

**అద్దె భవనంలో పోస్టల్ ఆఫీస్**

**టీ మీడియా, ఫిబ్రవరి 3, కొణిజర్ల :**ఒకవైపు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండి పాడవుతుంటే, మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె గదుల్లో కొనసాగుతూ ప్రజాధనం వృధా అవుతోంది. మండల పరిధిలోని తనికెళ్ల లోని స్త్రీ శక్తి భవనం మరియు ఒక అంగన్‌వాడీ కేంద్రం గత కొంతకాలంగా వినియోగంలో లేక మూతపడి ఉన్నాయి. మరోపక్క, స్థానిక పోస్ట్ ఆఫీస్ ప్రైవేటు భవనంలో ఉంటూ నెలకు వేల రూపాయల అద్దె చెల్లిస్తోంది.

**అద్దె వృధా.. అస్తవ్యస్తంగా భవనాలు:**

ప్రస్తుతం పోస్ట్ ఆఫీస్ నడుస్తున్న భవనానికి ప్రభుత్వం ప్రతి నెలా అద్దె రూపంలో భారీగా నిధులు ఖర్చు చేస్తోంది. అదే సమయంలో, లక్షల రూపాయలతో నిర్మించిన స్త్రీ శక్తి భవనం, ఒక అంగన్వాడి భవనాలు వాడుకలో లేక చెత్త మొక్కలు పెరిగి మరింత భయంకరంగా విష సర్పాలకు నిలయంగా మారుతున్నాయి. ఈ భవనాలు ఇలాగే వదిలేస్తే మరికొద్ది రోజుల్లో పూర్తిగా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉంది.నిరుపయోగంగా ఉన్న ఈ భవనాల్లోకి పోస్ట్ ఆఫీస్‌ను తరలించడమా లేక గ్రంథాలయం ఏర్పాటు చేయటం చేస్తే ప్రభుత్వానికి రెండు విధాలా లాభం చేకూరుతుందని గ్రామస్థులు సూచిస్తున్నారు. ప్రైవేటు భవనాలకు చెల్లిస్తున్న అద్దె భారం ప్రభుత్వానికి తప్పుతుంది. నిత్యం అధికారులు, ప్రజల రాకపోకలు ఉండటం వల్ల ప్రభుత్వ భవనాలు శుభ్రంగా, పటిష్టంగా



ఉంటాయి.స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు చొరవ తీసుకుని, ఉన్నతాధికారుల అనుమతితో ఈ భవనాలను పోస్ట్ ఆఫీస్ వినియోగం కోసం కేటాయించాలని గ్రామ ప్రజలు సూచిస్తున్నారు.దీనివల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయం కూడా ఆదా అవుతుందని వారు గుర్తు చేస్తున్నారు.